సాక్షి నిజామాబాద్

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



కాంగ్రెస్ కోటలో గులాబీ జెండా

ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న బోధన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాగా వేసింది. మొత్తం 16సార్లు ఎన్నికలు జరిగాయి.

- 10లో ▸



వైభవంగా రథోత్సవం

డిచ్‌పల్లిలోని బెటాలియన్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.1 /17.9

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఆలయాల మూసివేత



నిజామాబాద్ సిటీ: చంద్రగ్రహణం కారణంగా శనివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి జిల్లాలో అన్ని ఆలయాలను మూసివేశారు. అశ్వయుజ శుద్ధ పూర్ణిమ శనివారం రాత్రి 1.06 నుంచి 2.25 గంటలకు వరకు రాహుగ్రస్త చంద్ర గ్రహణం ఉండటంతో దేవాలయాల ద్వార బంధనం చేశారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ పూజా కార్యక్రమం అనంతరం 8 గంటలకు భక్తులకు దర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం ఇళ్లను శుభ్రం చేసుకోవడంతో పాటు తలస్నానం చేయాలని, యజ్ఞోపవీతమును మార్చుకోవాలని ఇస్కాన్ టెంపుల్ సిద్ధి బాలరాం దాస తెలిపారు.

నేడు బాబ్లీ గేట్లు..

- ఎగువ నుంచి నిలిచిపోనున్న వరద



బాల్కొండ: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన ఉన్న మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను త్రీ సభ్య కమిటీ సమక్షంలో ఆదివారం మూసివేయనున్నారు. సుప్రీం తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లను ప్రతి ఏడాది అక్టోబర్ 29న మూసి, మరుసటి ఏడాది జూలై 1న తెరవాలి. పరీవాహక ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటికి బదులుగా మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని వదలాలని సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొంది. ఎస్సారెస్పీ అధికారులు, నాందెడ్ ఇరిగేషన్ అధికారులు, సీడబ్ల్యూసీ అధికారులు సమక్షంలో ఆదివారం ఉదయం 11 గంటలకు బాబ్లీ గేట్లను మూసి వేయనున్నారు. ఎగువ నుంచి ఎస్సారెస్పీకి వెయ్యి క్యూసెక్కుల వరద వస్తుండగా, బాబ్లీ గేట్లు మూసివేస్తే ఇన్‌ఫ్లో నిలిచిపోనుంది.

అకౌంట్ నుంచి రూ.9 లక్షలు మాయం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలపల్లికి చెందిన షేక్ ఫహీమ్ అకౌంట్లో నుంచి రూ.తొమ్మిది లక్షలు మాయమయ్యా యి. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు.. షేక్ ఫహీమ్ ఎస్‌బీఐ అకౌంట్ నుంచి ఈనెల 25 నుంచి 27 వరకు పలు దఫాలుగా రూ.9 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు చెప్పారు. శనివారం తన మిత్రుడికి యోనో యాప్ ద్వారా డబ్బులు పంపించడానికి ప్రయత్నించగా అకౌంట్‌లో లేకపోవడంతో శివాజీనగర్ బ్రాంచీలో సంప్రదించాడు. పలు దఫాలుగా డబ్బులు కట్ అయినట్లు వారు చెప్పడంతో బాధితుడు 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు.

సీఎంను కలిసిన సుభాష్‌రెడ్డి దంపతులు




సాక్షి, కామారెడ్డి: బీబీపేట మండలం జనగామకు చెందిన ప్రముఖ బిల్డర్, సమాజ సేవకుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, ఆయన సతీమణి రజని శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారితో సమావేశమై కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధిపై చర్చించారు. సుభాష్‌రెడ్డి సొంత డబ్బులు రూ.6 కోట్లతో బీబీపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మించిన విషయమై సీఎం అభినందించారు. అనంతరం మంత్రి కేటీఆర్‌ను కూడా సుభాష్‌రెడ్డి దంపతులు కలిశారు.

బీసీకా.. మైనారిటీకా!

కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి నిజామాబాద్ అర్బన్ టికెట్టు విషయమై అనేక మలుపులు చోటుచేసుకుంటున్నాయి. ఈ సీటు కోసం బీసీ సామాజిక వర్గానికి చెందిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. కాగా ఈ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ వర్గం ఓట్లు గణనీయ సంఖ్యలో ఉండటంతో టికెట్టును ముస్లింలకు కేటాయించనున్నట్లు చర్చ జరుగుతోంది. మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేరు మొదట్లో చర్చకు వచ్చినప్పటికీ తాజాగా తాహెర్‌బిన్ హందాన్ పేరు రేసులో ముందుకు వచ్చింది.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



- నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ టికెట్టుపై తీవ్ర ఉత్కంఠ
- ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయంలో పార్టీ శ్రేణులు
- ఓ వైపు బీసీ కోటా డిమాండ్.
- మరోవైపు గణనీయంగా ముస్లిం ఓట్లు


నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ టికెట్టు విషయంలో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. ఈ సీటును బీసీ కోటాలో కేటాయించాలని డిమాండ్లు ఉండగా మరోవైపు మైనారిటీలకు ఇవ్వాలనే చర్చ సాగుతోంది. పార్టీ నాయకత్వం ప్రకటించిన రెండో జాబితాలో సైతం ఈ టికెట్టు విషయాన్ని పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. మొదటి నుంచి నిజామాబాద్ అర్బన్ టికెట్టు అంశంలో అనేక మలుపులు చోటుచేసుకుంటున్నాయి. ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలోనే లాబీయింగ్ చేస్తూ వస్తున్నారు. ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో బీసీలకు రెండు నుంచి మూడు శాసనసభ సెగ్మెంట్లు కేటాయించాలని కాంగ్రెస్‌లోని బీసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ అర్బన్ సీటును కచ్చితంగా బీసీలకు ఇవ్వనున్నారనే వార్తలు వచ్చాయి. దీంతో పాటు కోరుట్ల సీటును బీసీలకు ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆ సీటును వెలమ సామాజిక వర్గానికి కేటాయించారు. మిగిలిన జగిత్యాల, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్ సీట్లను రెడ్డి సామాజిక వర్గం నాయకులకు కేటాయించారు. ఈ నేపథ్యంలో మిగిలిన ఒకే ఒక్క నిజామాబాద్ అర్బన్ నుంచి బీసీని బరిలోకి దించనున్నట్లు కార్యకర్తలు భావించారు.

ఈ సీటు కోసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అయితే ఇక్కడ మరో మలుపు చోటుచేసుకుంది. ఈ స్థానంలో ముస్లిం మైనారిటీ ఓట్లు 1.20 లక్షలు ఉన్నాయని, దీంతో ఈ సీటును ముస్లింలకు కేటాయించనున్నట్లు చర్చ జరుగుతోంది. ముస్లిం వర్గం నుంచి పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ మొదటి నుంచి ఈ సీటును ఆశిస్తున్నారు. కాగా బీసీలకు కేటాయిస్తారనే నేపథ్యంలో తాహెర్ పేరు వెనుక్కు వెళ్లింది. అయితే మారిన పరిణామాల నేపథ్యంలో ఈ స్థానం నుంచి మాజీ మంత్రి షబ్బీర్‌అలీ బరిలోకి దిగనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

కామారెడ్డిలో బీఆర్‌ఎస్ తరపున బరిలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలోకి దిగుతారనే చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈ క్రమంలో షబ్బీర్‌ను నిజామాబాద్ అర్బన్‌కు పంపనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కామారెడ్డిలో రేవంత్ పోటీ చేస్తే, షబ్బీర్ నిజామాబాద్ అర్బన్‌కు వస్తే కామారెడ్డిలో కీలకమైన ప్రచార బాధ్యతలు ఎవరు చూడాలనే చర్చ వస్తోంది. అక్కడి పరిస్థితులు అవగాహన ఉన్న షబ్బీర్ లేకుండా కేసీఆర్‌తో తలపడాలంటే పెద్ద టాస్కేనని నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో మళ్లీ తాహెర్‌బిన్ హందాన్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు రేసులో ముందుకు వచ్చారు. పరిస్థితి ఇంత జటిలంగా మారిన క్రమంలో నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ సీట్లను సైతం పార్టీ నాయకత్వం పెండింగ్‌లో పెట్టింది. మరోవైపు ఎల్లారెడ్డి టిక్కెట్టును మదన్‌మోహన్‌కు కేటాయించగా సుభాష్‌రెడ్డి రెబెల్‌గా బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి సీట్లపై తకరారు నెలకొనడంతో పార్టీ శ్రేణులు ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయంలో ఉన్నాయి.

పోలింగ్‌శాతం పెంపు దిశగా..

- మహిళా, దివ్యాంగుల, మోడల్ స్టేషన్ల గుర్తింపు
- 72 సెంటర్లను సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశం



సుభాష్‌నగర్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం మోడల్ పోలింగ్ కేంద్రంతోపాటు మహిళాఉద్యోగులు, వికలాంగ, యువ ఉద్యోగులు, సిబ్బంది నిర్వహించే కేంద్రాలను అధికారులు గుర్తించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 1549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13,65,811 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 6,47,149, స్త్రీలు 7,18,603 మంది ఉన్నారు. పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. అన్ని విభాగాలకు కలిపి 72 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయనున్నారు.

30 మోడల్ పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గానికి ఐదు చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఎన్నికల సంఘం.. ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 30 సెంటర్లను గుర్తించింది. మోడల్ కేంద్రాలను మామిడి తోరణాలు, అరటి కొమ్మలు, కొబ్బరి మట్టలతో అలంకరించడంతోపాటు టెంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లను ఆహ్వానించేందుకు రిసెప్షనిస్టులను నియమిస్తారు. తాగునీరు, కుర్చీలు, కార్పెట్లు, ఇతర సకల సౌకర్యాలను ఆయా పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తారు. ప్రతి ఎన్నికలకు ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసినా.. ఈసారి మరింత ప్రత్యేకత చాటుకునేలా సిద్ధం చేస్తున్నారు.

మహిళా ఉద్యోగులు, సిబ్బందితో 30 కేంద్రాలు

మహిళాఉద్యోగులు, సిబ్బందితో నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలను నిర్వహించాలని ఎన్నికల సంఘం భావించింది. ఇందుకోసం 30 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇందులో కేవలం మహిళా ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వర్తించనున్నారు.

నియోజకవర్గానికి ఒకటి చొప్పున..

జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున దివ్యాంగులైన ఉద్యోగులు విధులు నిర్వహించేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే యువ ఉద్యోగులు కూడా నియోజకవర్గానికి ఒకటిచొప్పున పోలింగ్ కేంద్రాలను నిర్వహించనున్నారు.

ఉపాధి, ఉద్యోగాల ఊసేది?

- మేనిఫెస్టోల్లో 'ఉచితాలకే' చోటు
- ఎక్కడా కనిపించని కొలువుల భర్తీ అంశం
- రాజకీయ పార్టీల తీరుపై యువత అసంతృప్తి



మోర్తాడ్(బాల్కొండ): మహిళలు, రైతులను ప్రసన్నం చేసుకుంటే ఎన్నికల్లో సులభంగా గట్టెక్కవచ్చనే భావన ప్రధాన రాజకీయ పార్టీల్లో కనిపిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఓట్లు ప్రభావితం చేసే అవకాశం ఉండడం, మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ రెండు వర్గాల ఓట్లను రాబట్టుకునేందుకు రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల్లో ఆకర్షణీయ పథకాలను ప్రవేశపెట్టాయి. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్‌తోపాటు, కాంగ్రెస్ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అయితే ఎక్కడ కూడా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చేర్చకపోవడం గమనార్హం. బీజేపీ తన మేనిఫెస్టోను ఇంకా విడుదల చేయకపోయినా ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రసంగాలను పరిశీలిస్తే నిరుద్యోగుల పట్ల మెతక వైఖరిని అవలంబిస్తున్నట్లుగానే ఉందని స్పష్టమవుతోంది. మహిళల ఖాతాల్లో ప్రతినెలా డబ్బులు జమ చేయడం, గ్యాస్ సిలిండర్ల ధర తగ్గించడం, పింఛన్ల పెంపు, రైతులకు పెట్టుబడిసాయం, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఆకర్షణీయ పథకాలు, ఇంటింటికి బీమా, ఆరోగ్య బీమా, కొత్త గురుకులాలు ఏర్పాటు అంశాలనే ఆయా పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశాన్ని చేర్చకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. యువతను ఆకట్టుకునే పథకాలేవీ లేకపోవడంతో అంతటా అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయినప్పటికీ... ఎన్నికల షెడ్యూల్ వెలువడడం, అంతకు ముందు పేపర్ లీకేజీ తదితర కారణాలతో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ స్తంభించింది.

చిన్నచూపు చూస్తున్నారు



రాజకీయ పార్టీలు నిరుద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయి. ఉద్యోగ అవకాశాల కోసం ఎంతో మంది విద్యావంతులు నిరీక్షిస్తున్నారు. తాము ఎన్నికల్లో గెలిస్తే ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఏ పార్టీ కూడా ప్రకటించక పోవడం దారుణం.

– వినీత్‌కుమార్‌గౌడ్, సామాజిక కార్యకర్త

నిరుద్యోగులు సత్తా చాటాలి



ఉద్యోగ అవకాశాలపై ఏ పార్టీ స్పష్టత ఇవ్వకపోవడం సిగ్గుచేటు. నిరుద్యోగులు తమ సత్తా చాటాలి. ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో రాజకీయ పార్టీలకు నిరుద్యోగులు దడ పుట్టించాలి. యువత తమ సత్తా ఏమిటో చాటితే భవిష్యత్ బాగుంటుంది.

– మామిడాల మనోహర్, సామాజిక కార్యకర్త

నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

- నవంబర్ 7లోగా ఫారం–12(డి) అందజేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం వేర్వేరుగా సమాశాలు నిర్వహించారు. అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ కోసం అవకాశం కలిగి ఉండి, దానిని వినియోగించుకునే వారు నవంబర్ 7వ తేదీలోగా నిర్ణీత ఫారం–12(డి) భర్తీచేసి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు, 40శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు, కొవిడ్ పాజిటివ్ కలిగిన వారికి ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు ఉందన్నారు. అదేవిధంగా అత్యవసర సర్వీసులకు చెందిన వారితోపాటు ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాస్‌లు కలిగిన జర్నలిస్టులు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ అనుమతించినట్లు తెలిపారు.

ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులతో..

జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, 127 'ఎ' సెక్షన్ ప్రకారం ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి రాజకీయ పార్టీల ప్రచార సామగ్రి ముద్రణ పనులు చేయాలని సూచించారు. అనుమతి పొందిన వాటిని మాత్రమే ముద్రించాలన్నారు. ప్రచురించే ప్రచార సామగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నంబర్, ప్రచురణప్రతుల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా తదితర వివరాలను ముద్రించాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, నోడల్ అధికారి తిరుమల ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌గా ఓడి.. ఎమ్మెల్యేగా విజయం

- విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర
- నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం.. అత్యున్నత మంత్రి పదవులు
- శనిగరం సంతోష్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం



ఆర్థికశాఖమంత్రిగా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న శనిగరం సంతోష్‌రెడ్డి (ఫైల్)

ఒకప్పుడు వార్డు మెంబర్‌గా ఓడి..

ఎమ్మెల్యేగా విజయం సాధించిన శనిగరం సంతోష్‌రెడ్డి రాష్ట్ర ఆర్థికశాఖ, భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా సేవలందించారు. జిల్లా రాజకీయాలపై తనదైన ముద్రవేసిన సంతోష్‌రెడ్డి.. 1969లో అర్గుల్ రాజారాంతో కలిసి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి జైలు జీవితాన్ని గడిపారు.

ఆర్మూర్: విద్యార్థి నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శనిగరం సంతోష్‌రెడ్డి తన రాజకీయ జీవితాన్ని స్వగ్రామమైన భీమ్‌గల్ మండలం ముచ్కూర్ నుంచి ప్రారంభించారు. సొంత ఊరిలో వార్డు మెంబర్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఆయన.. తరువాతి కాలంలో ఎమ్మెల్యేగా గెలుపొంది ఆర్థిక, భారీ పరిశ్రమలు తదితర శాఖలకు మంత్రిగా పనిచేసి రాష్ట్రస్థాయిలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. మృదుస్వభావిగా, రాజకీయ చతురినిగా గుర్తింపు పొందిన సంతోష్‌రెడ్డి.. నాలుగు పర్యాయాలు ఆర్మూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

- 1964 – 65లో కళాశాల విద్యనభ్యసిస్తున్న రోజుల్లో నిజామాబాద్ గిరిరాజ్ కాలేజీ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. 1966 – 67 కాలంలో కళాశాల అధ్యక్షుడిగా కొనసాగారు. బడుగు, బలహీనవర్గాల నేత, మాజీ మంత్రి అర్గుల్ రాజారాం, తన బావ అయిన స్వాతంత్య్ర సమరయోధుడు బీఆర్ గంగారెడ్డి స్ఫూర్తి, ప్రోద్బలంతో సంతోష్‌రెడ్డి రాజకీయాల్లోకి అడుగు పెట్టారు.
- 1969లో తెలంగాణ రాష్ట ఏర్పాటు కోసం అర్గుల్ రాజారాంతో కలిసి ఉద్యమించి జైలు జీవితాన్ని సైతం గడిపారు.
- 1970లో తన స్వస్థలమైన భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- 1971లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, నిజామాబాద్ బీడీ మజ్దూర్ సంఘ్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.
- 1975లో యువజన కాంగ్రెస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. తన రాజకీయ గురువుల సహకారంతో 1978లో కాంగ్రెస్ తరపున ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాటి నుంచి ఆయన వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండపోయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం అదే ఏడాది మొట్టమొదటిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. సినీ నటుడు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా తెలుగుదేశం అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందారు. ఆ సమయంలో సంతోష్‌రెడ్డి ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించి చరిత్ర సృష్టించారు.
- 1985లో టీడీపీ అభ్యర్థి ఏలేటి మహిపాల్‌రెడ్డి చేతుల్లో ఓటమి పాలయ్యారు.
- 1989లో టీడీపీ అభ్యర్థి వేముల సురేందర్‌రెడ్డిపై విజయం సాధించి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1990 – 91వరకు రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా, 1991 – 92 వరకు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కేబినెట్‌లో ఆర్థికశాఖ మంత్రిగా, 1992 – 93 వరకు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- 1994లో టీడీపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మపై చేతిలో ఓటమి పాలయ్యారు.
- 1999లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 3,500 స్వల్ప ఓట్లతో ఓటమిపాలయ్యారు. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా 2001లో ఆవిర్భవించిన టీఆర్‌ఎస్‌లో భీమ్‌గల్ జెడ్పీటీసీగా గెలుపొందారు. మెజార్టీ సభ్యుల బలంతో నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2004 ఎన్నికల్లో జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామ చేసిన సంతోష్‌రెడ్డి.. టీఆర్‌ఎస్ నుంచి ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీఆర్‌ఎస్‌లో అసమ్మతి బాటపట్టి కాంగ్రెస్ వాదిగా కొనసాగారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న ఆయన తన పదవీ కాలం ముగియకముందే రాజీనామా చేశారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇకముందు ఎలాంటి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని సంతోష్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరకున్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో ఉన్న సత్సంబంధాలతో తన తనయుడు శనిగరం శ్రీనివాస్‌రెడ్డి(వాసు)ని 2009 ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గం నుంచి పోటీకి నిలిపారు. ఓటమి పాలవడంతో శ్రీనివాస్‌రెడ్డి అమెరికాకు వెళ్లిపోయారు. అయినా సంతోష్‌రెడ్డి తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో విభేదించి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో తిరిగి దిగ్విజయ్‌సింగ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించకపోవడంతో నియోజకవర్గ రాజకీయాలకు దూరంగా ఉంటూ చికిత్స చేయించుకుంటున్నారు.

అలా వచ్చారు.. ఇలా టికెట్టు కొట్టారు

- రాహుల్ పర్యటనతో మరో జాక్‌పాట్
- ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఇరువురు నేతలు



సునీల్‌రెడ్డి



వినయ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి గత జూలై 20న పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సెప్టెంబర్ 8న చేరారు. గత ఎన్నికల్లో సునీల్‌రెడ్డి బీఎస్పీ తరుపున, వినయ్‌రెడ్డి బీజేపీ తరుపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఇటీవలే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వీరిద్దరూ మొదటి జాబితాలోనే కాంగ్రెస్ టికెట్టు దక్కించుకున్నారు. బలమైన అభ్యర్థులుగా బరిలో ఉన్న వీరిద్దరూ పక్కపక్క నియోజకవర్గాల వారే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా వీరిద్దరి నియోజకవర్గాల్లో ప్రచారానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నెల 20న పర్యటించారు. రోడ్‌షో, కార్నర్ మీటింగుల్లో రాహుల్ పాల్గొని ప్రసంగించారు.

క్లుప్తంగా

పిల్లలను నిత్యం బడికి పంపాలి



మాక్లూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం పాఠశాలకు పంపాలని, ఇంటి వద్ద ప్రత్యేక సమయం కేటాయించి చదువుకునే విధంగా ప్రోత్సహించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు చక్రపాణి, రమేష్, హెచ్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెట్‌వర్కింగ్ డైరెక్టర్‌గా అపర్ణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్కింగ్, వెబ్‌కౌన్సెలింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ కె అపర్ణ నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎం యాదగిరి శనివారం అపర్ణకు నియామక ఉత్తర్వులు అందజేశారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన అపర్ణ గతంలో అడిషనల్ కంట్రోలర్‌గా,వుమెన్ సెల్ డైరెక్టర్‌గా, ఈక్వల్ అపర్చునిటీ సెల్ డైరెక్టర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు.

మాస్ కమ్యూనికేషన్‌లో శ్రీనివాస్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పరిశోధక విద్యార్థి సింగారం శ్రీనివాస్ డాక్టరేట్ సాధించారు. సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ రేడియో ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ - ఏ స్టడీ ఆఫ్ ఆల్‌ఇండియా రేడియో- నిజామాబాద్ ప్రోగ్రామ్స్' అనే అంశంపై శ్రీనివాస్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శనివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో జరిగిన వైవావోస్‌కు శ్రీరామానందతీర్థ మరట్వాడా యూనివర్సిటీ ప్రొఫెసర్ దీపక్ షిండే ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి పి శాంతాబాయి, అధ్యాపకులు మోహన్, శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు. పీహెచ్‌డీ సాధించిన శ్రీనివాస్‌ను రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు.

కాంగ్రెస్ కోటలో గులాబీ జెండా

- బోధన్‌లో ఆరు ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్
- నాలుగు సార్లు స్వతంత్ర అభ్యర్థుల విజయం
- 1963లో ఏకగ్రీవంగా ఎన్నికైన కేవీ రెడ్డి
- హ్యాట్రిక్ విజయం సాధించిన పి సుదర్శన్‌రెడ్డి
- మహిళలకు దక్కని ప్రాతినిధ్యం

జంగ్ తెలంగాణ



బోధన్ ముఖచిత్రం


బషీరుద్దీన్‌బాబుఖాన్


ఎం నారాయణరెడ్డి


కేవీ రెడ్డి


పి సుదర్శన్‌రెడ్డి


మహ్మద్ షకీల్ ఆమేర్

నియోజకవర్గ ఓటర్లు

పురుషులు	1,03577
మహిళలు	1,12,381
ఇతరులు	05
మొత్తం	2,15,963

బోధన్: కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న బోధన్ నియోజకవర్గంలో ప్రస్తుతం బీఆర్ఎస్ పాగా వేసింది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు మొత్తం 15 సార్లు సాధారణ, ఒక ఉప ఎన్నిక జరిగాయి. ఇందులో ఆరుసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, రెండు సార్లు బీఆర్ఎస్, మరో నాలుగు సార్లు స్వతంత్ర అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో కాంగ్రెస్ పాగా వేయగా, రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ గులాబీ జెండా ఎగురవేసింది. 1957 నుంచి 1972 వరకు వరుసగా నాలుగు సార్లు స్వతంత్ర అభ్యర్థులు శ్రీనివాస్‌రావు, రాంగోపాల్‌రెడ్డి, కేవీ రెడ్డి, ఆర్ భూంరావు ఎమ్మెల్యేలుగా సత్తాచాటి గుర్తింపు తెచ్చుకున్నారు. 1962లో ఎన్నికల్లో బోధన్, కరీంనగర్ నుంచి పోటీ చేసి రెండు చోట్ల గెలిచిన రాంగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో 1963 కేవీ రెడ్డి(స్వతంత్ర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు మహిళలకు ప్రాతినిధ్యం దక్కలేదు. 1999 లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి కె సుధారాణి, 2014లో పిరమిడ్ నుంచి రజితరాణిలో పోటీ చేసి ఓడిపోయారు.

ఆ ఇద్దరికే మంత్రి పదవులు

పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి 1989లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిచి, టీడీపీ అభ్యర్థి కొత్త రమాకాంత్ చేతిలో ఓటమి చెందారు.1994లో కాంగ్రెస్ టిక్కెట్ రాలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీకి దిగి అనంతరం పార్టీ అధిష్టానం సూచన మేరకు తప్పుకున్నారు. అనంతరం 1999, 2004, 2009 ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. టీడీపీ నుంచి 1985, 1994 బషీరుద్దీన్ బాబుఖాన్ రెండు పర్యాయాలు గెలిచారు. నియోజకవర్గం నుంచి సుదర్శన్‌రెడ్డి, బషీరుద్దీబాబుఖాన్ మంత్రులుగా పని చేశారు. సుదర్శన్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో వైద్య విద్యాశాఖ మంత్రిగా, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేశారు. బషీరుద్దీన్ ఖాన్ ఎన్‌టీ ఆర్, చంద్రబాబు హయాంలో ఉన్నత విద్యా, పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

ముగ్గురు మైనారిటీ నేతల గెలుపు

ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు వేర్వేరు పార్టీల నాయకులకు ఓటర్లు ఆదరించారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన న్యాయవాది గులాం సందానీ, 1985, 1994 ఎన్నికల్లో రెండుసార్లు టీడీపీ అభ్యర్థిగా బషీరుద్దీన్ బాబుఖాన్, 2014, 2018లో టీఆర్ఎస్(బీఆర్ఎస్) నుంచి మహ్మద్ షకీల్ ఆమేర్ గెలుపొందారు.

వారే నేటి ప్రత్యర్థులు

ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులుగా షకీల్, సుదర్శన్‌రెడ్డి పేర్లు ఖరారయ్యాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డి, టీఆర్ఎస్, టీడీపీ మహాకూటమి తరఫున టీఆర్ఎస్ అభ్యర్థిగా షకీల్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో 1295 ఓట్ల ఆధిక్యతతో సుదర్శన్‌రెడ్డి విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో వారిద్దరే పోటీ పడ్డారు. రెండు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్ గెలుపొందారు. ఈ సారి కూడా వారే తలపడనున్నారు. దీంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ నెలకొంది.

తాజా రాజకీయ పరిస్థితులు

బోధన్‌లో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ టిక్కెట్ కోసం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి పోటీ పడుతున్నారు. అధిష్టానం ప్రకాశ్‌రెడ్డి వైపు మొగుచూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

శివసేన, బీఎస్పీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఎన్నికల బరిలో తమ అభ్యర్థులుంటారని ప్రకటించాయి. ప్రధాన పార్టీల శ్రేణులు ప్రచారం క్షేత్రంలో దూసుకుపోతున్నాయి.

బోధన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు

పదవీ కాలం	పేరు	పార్టీ
1952–57	వీఎస్ఎల్ శాస్త్రీ	కాంగ్రెస్
1957–62	శ్రీనివాస్‌రావు	ఇండిపెండెంట్
1962–63	ఎం రాంగోపాల్‌రెడ్డి	ఇండిపెండెంట్
1963–67	కేవీ రెడ్డి	ఏకగ్రీవం(ఇండిపెండెట్)
1967–72	ఆర్ భూంరావు	ఇండిపెండెంట్
1972–78	ఎం నారాయణరెడ్డి	కాంగ్రెస్
1978–83	గులాం సందానీ	కాంగ్రెస్
1983–85	డి సాంబశివరావు చౌదరి	టీడీపీ
1985–89	బషీరుద్దీన్ బాబుఖాన్	టీడీపీ
1989–94	కొత్త రమాకాంత్	టీడీపీ
1994–99	బషీరుద్దీన్‌బాబు ఖాన్	టీడీపీ
1999–04	పి సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2004–09	పి సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2009–14	పి సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2014–18	మహ్మద్ షకీల్	బీఆర్ఎస్
2018–	మహ్మద్ షకీల్	బీఆర్ఎస్

నియోజకవర్గ స్వరూపం

బోధన్ ఓటర్లు సార్వత్రిక ఎన్నికల్లో విభిన్న తీర్పు ఇచ్చి రాజకీయ చతురత చాటుతున్నారు. మహారాష్ట్ర సరిహద్దు, మంజీర, గోదావరి నదులు తీరంలో ఉన్న బోధన్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. నియోజకవర్గంలో బోధన్ పట్టణం, మండలం, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాలుండగా, కొత్తగా బోధన్ మండలాన్ని విభజించి ఏర్పాటు చేసిన సాలూర రెవెన్యూ మండలాలున్నాయి.

ఆర్మూర్ కోర్టు ఏజీపీగా ప్రదీప్


ప్రదీప్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్‌ను ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమిస్తు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీచేశారు. ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆయన అధికార యంత్రాంగం తరఫున వాదనలు వినిపిస్తారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృత్యువాత


ఘటన స్థలంలో ధ్వంసమైన కారు, బైక్


భూమన్న మృతదేహం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి శివారులోని పాటి హన్మాన్ ఆలయం వద్ద శనివారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన గంగరాజుల భూమన్న(50) తన ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కమ్మర్‌పల్లి పాటి హన్మాన్ వద్ద మల్లాపూర్ మండలం రత్నాపూర్ వెళ్తున్న కారు ఢీ కొనడంతో భూమన్న కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అంబులెన్స్‌లో మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

కుమారుడితో కలిసి భర్త హత్య

కమ్మర్‌పల్లి: ఓ మహిళ తన కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన ఘటన కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. చౌట్‌పల్లిలోని వడ్డెర కాలనీకి చెందిన పల్లపు ఎల్లయ్య(40)కు భార్య రాజు, కుమారుడు నవీన్ ఉన్నారు. ఎల్లయ్య, నవీన్ బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లారు. నెల క్రితం ఎల్లయ్య, 15 రోజుల క్రితం నవీన్‌లు దుబాయి నుంచి ఇంటికి వచ్చారు. శుక్రవారం రాత్రి ఎల్లయ్య, ఆయన భార్య రాజు, కొడుకు నవీన్ గొడవ పడ్డారు. ఈక్రమంలో రాజు, నవీన్ కలిసి ఎల్లయ్య గొంతు నులమడంతో పాటు తలపై బలంగా కొట్టారు. దీంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరి బోదాసు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఇందల్వాయి: ఇందల్వాయి రైల్వే స్టేషన్‌లో భీమ్‌గల్ ఎక్సైజ్ పోలీసులు శనివారం జరిపిన తనిఖీల్లో అర్సపల్లికి చెందిన షేక్ హుస్సేన్ నుంచి 70 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై వేణు మాదవ్ తెలిపారు. నిందితుడిని విచారించి, అతని ఇంటి వద్ద మరో 470 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. హుస్సేన్ నాందేడ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ఫయాజ్, దత్తాద్రి పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం..

భీమ్‌గల్: మండలంలోని సికింద్రాపూర్‌లో శుక్రవా రం రాత్రి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు పట్టకున్నారు. గ్రామానికి చెందిన భుక్య తిరుపతి, షేక్ హుస్సేన్‌ను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.68 వేల విలువ మద్యం స్వాధీనం చేసుకున్నారు. సీఐ స్వప్న, ఎస్సై రామ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు రాజన్న, శ్రీను ప్రసాద్, కానిస్టేబుళ్లు అవినాష్, గంగారాం పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

రెంజల్: చెల్లి పెళ్లి కోసం, తమ్ముడిని దుబాయి పంపేందుకు చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన భాస్కర్(25) ఈ నెల 25న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. భాస్కర్ నాలుగేళ్ల క్రితం అప్పు చేసి, చెల్లి పెళ్లి చేశాడు. తర్వాత ఏడాది తమ్ముడిని దుబాయికు పంపాడు. ఆ అప్పులను తీర్చే దారిలేక 25న పురుగుల మందు తాగాడు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఎడపల్లిలో ఒకరు..

ఎడపల్లి: ఎడపల్లి గ్రామానికి చెందిన కళ రామ్‌చందర్(32) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రామ్‌చందర్ రూ.రెండు లక్షలు అప్పు చేసి, ఆన్‌లైన్‌లో తీసుకున్న లోన్ చెల్లించాడు. ఆ రూ.రెండు లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక, మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకున్నాడు. రామ్ చందర్ తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై విక్రమ్ తెలిపారు.

అనారోగ్యంతో మహిళ..

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల డబుల్ బెడ్రూం ఇళ్లలో శనివారం ఎనుముల బాలమణి(57)అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలమణి కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతోంది. చాలా చోట్ల చూపించుకున్న నయం కాలేదు. దీంతో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఘటనా స్థలాన్ని ఎస్సై లావణ్య పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మోపాల్: కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన ఓ యువకుడిపై మోపాల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు తెలిసింది. విశ్వసనీయంగా తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17)కు, సదరు యువకుడు వరుసకు బావ (బాలిక పెద్దమ్మ కుమార్తె భర్త) అవుతాడు. భార్య మృతి చెందడంతో ఆయన బాలికకు దగ్గరయ్యాడు. దీంతో బాలిక ప్రస్తుతం ఐదు నెలల గర్భిణీ. విషయం తెలుసుకున్న బాలిక అన్న ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఎన్నికల వేళ పెళ్లి సందడి

- కల్యాణ మండపాలే ప్రచార వేదికలు
- నవంబర్ 30న పోలింగ్

ఖలీల్‌వాడి: ఒక వైపు ఎన్నికల ప్రచారం ఉండగా మరో వైపు పెళ్లి ముహూర్తాలు ఉండడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మండపాలే ఎన్నికల ప్రచారం వేదికలు కానున్నాయి. నవంబర్ నెలలో 16, 19, 21, 22, 23, 24, 26, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. ఈ తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 6 వేల వరకు పెళ్లిలు జరిగే అవకాశాలు ఉన్నాయని పురోహితులు పేర్కొన్నారు. నవంబర్ 30న శాసనసభ ఎన్నికలకు పోలింగ్ ఉండడంతో పెళ్లిళ్ల హడావుడిలో పడి ఓటు వేయడం మరిచిపోవద్దని అధికారులు ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివాహాలు ఉమ్మడి జిల్లాలో జోరుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది శ్రావణమాసంలో ఆశించిన స్థాయిలో ముహూర్తాలు లేకపోవడంతో నవంబర్ నెలలోని 16 నుంచి 30 వరకు ముహూర్తాలు ఉండడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. నవంబర్ 30న పోలింగ్ ఉండడంతో అభ్యర్థులు ఓట్లను ఎలా సాధించుకోవాలని తర్జనభర్జన పడుతున్నారు. ఎన్నికల వేళల్లో పెళ్లి ముహూర్తంలో కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితులు ఎక్కువ మంది పెళ్లి హడావుడిలో ఉంటే ఓట్లు పడుతాయా లేదా అనే అంతర్మథనంలో పడిపోతున్నారు. దీంతో తమకు అనుకూలంగా ఉండే వర్గాలు పెళ్లిలో ఉంటే ఓట్లు రాకుండా పోతాయనే చర్చ జరుగుతోంది.

మండపాల్లో ప్రచారానికి ప్రణాళికలు

నవంబర్ 16 నుంచి 29 వరకు పెళ్లి ముహూర్తాలు ఉండడంతో ఈ వేడుకల్లోనే ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు వేదికలు కానున్నాయి. పెళ్లింటి నుంచి ఆహ్వానం అందితే చాలు అక్కడికి వెళ్లి అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు పక్కాగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆడ పెళ్లి వారికి ఎంతో అంత కట్న కానుకలు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో గ్రామాల వారీగా పెళ్లిలు ఎవరింట్లో ఉన్నాయి వాటి వివరాలను గ్రామస్థాయి నేతలతో సర్వే చేయిస్తున్నారు. దీంతో వాటి వివరాలను తమకు సంబంధించిన పీఆర్వోలతో తేదీలను డైరీల్లో రాయించుకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో ట్రయాంగిల్ పోటీ ఉండడం, ఓట్లు కీలకం కావడంతో పెళ్లిలను వేదికలుగా మల్చుకొని ఓట్లు రాబట్టేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

వాతావరణ కాలుష్యంతో వ్యాధులు


అవగాహన కల్పిస్తున్న జిల్లా నోడల్ అధికారి రవితేజ

నిజామాబాద్‌నాగారం: వాతావరణంలో మార్పులు రావడంతోనే వ్యాధులు విజృంభిస్తున్నయని డీఎంహెచ్‌వో సుదర్శనం, నోడల్ అధికారి రవితేజ అన్నారు. శనివారం నగరంలోని కార్యాలయ ఆవరణలో కాన్ఫరెన్సు హాల్‌లో ఆరోగ్య సిబ్బందికి అవగాహన, శిక్షణ వర్క్‌షాపును నిర్వహించారు. నోడల్ అధికారి రవితేజ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. గాలి కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు ఆస్తమా, బ్రాంకైటీస్ వస్తున్నాయని తెలిపారు. ఏఎన్‌ఎమ్, ఆశాకార్యకర్తలు గాలి కాలుష్యంతో కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గస్‌పూర్ వెంకటేశ్వర్లు, వెంకటేష్, డెమో గంగాధర్, రమ పాల్గొన్నారు.

షెడ్డును పరిశీలించిన రిజిస్ట్రార్


షెడ్డును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షెడ్డును రిజిస్ట్రార్ ఎం యాదగిరి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్సిటీలో అడ్మిషన్స్, స్కాలర్‌షిప్స్ సెక్షన్ కౌంటర్ల వద్ద విద్యార్థులకు ఎండ, వర్షం నుంచి రక్షణ కోసం షెడ్డును నిర్మించామన్నారు. దీంతో పాటు దరఖాస్తు ఫారాలు నింపేందుకు అవసరమైన టేబుల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్ ఉన్నారు.

వైభవంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న కమాండెంట్, భక్తులు


రథయాత్ర ముందు భక్తుల కోలాటం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని బెటాలియన్ ఆవరణలో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిత్య ఆరాధన, హవనం, బలిప్రధానం, సాయంత్రం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కమాండెంట్ బి రాంప్రకాష్ దంపతులు స్వామి వారి రథాన్ని భక్తులతో కలిసి లాగి రథయాత్రను ప్రారంభించారు. భక్తులు, పిల్లలు కోలాటాలతో భజన పాటలు పాడుతూ.. స్వామి వారి నామస్మరణ చేస్తుండగా రథయాత్ర బెటాలియన్‌లోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌రెడ్డి, భూదానకర్త కుమారులు ప్రమోద్ రాజు, వినోద్ రాజు, అసిస్టెంట్ కమాండెంట్లు సీ ఆంజనేయరెడ్డి, కే భాస్కర్‌రావు, ఏవో హంసరాణి పాల్గొన్నారు.

భూసారానికి అనుగుణంగా పంటలు వేయాలి


రైతులకు విత్తనశుద్ధి మందులు అందిస్తున్న శాస్త్రవేత్త బాలాజీనాయక్

బోధన్: యాసంగి సీజన్‌లో నీటి వసతి, నేలసారానికి అనుగుణంగా సరైన పంటలను ఎంచుకొని సాగు చేయాలని రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన సంస్థ అధిపతి టీ బాలాజీనాయక్ రైతులకు సూచించారు. శనివారం సాలూర మండలం హున్సా గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైజోబియం, ట్రైకోడర్మా మందుతో విత్తన శుద్ధి చేసినట్లయితే శనగ పంటలో ఎండు తెగులు ఆశించకుండా నియంత్రించవచ్చన్నారు. విత్తనశుద్ధి మందు ప్యాకెట్లను రైతులకు అందించారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. సర్పంచ్ చీల గంగమణి గంగారాం, సాయిచరణ్, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, కృష్ణ చైతన్య, నరేందర్, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు : ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో శనివారం రాత్రి బైక్‌ను వెనక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. నిజామాబాద్ నగరంలోని పవన్‌నగర్‌కు చెందిన కారె బాలాజీ (32) లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై ఒక యువతితో కలిసి డిచ్‌పల్లి వైపు వస్తున్నాడు. అదే సమయంలో ఇందల్వాయికి చెందిన ఇద్దరు యువకులు కారులో అతివేగంగా వస్తూ వీరి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన యువతిని స్థానికుల సాయంతో పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలాజీ దగ్గర లభించిన మొబైల్ నుంచి వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తల్లి ఘటనా స్థలానికి చేరుకొని కొడుకు మృతదేహాన్ని విలపించింది. ఇంట్లోకి వస్తువులు తీసుకుని వస్తానని రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లిన కొడుకు కాసేపట్లో వస్తాడని ఎదురు చూస్తుంటే ఇలా చనిపోయాడనే వార్త వినాల్సి వచ్చిందని ఆమె రోదించింది. బాలాజీకి సుమారు నెల క్రితమే కూతురు జన్మించిందని తెలిపింది. అయితే బైక్‌పై ఉన్న యువతి ఎవరో తెలియడం లేదని ఆమె చెప్పారు. బైక్‌ను ఢీకొన్న తర్వాత కారు డివైడర్‌ను మూడు సార్లు ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. కారులోని ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రైలు పట్టాలపై కూలీ మృతి

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ముల్లంగి(ఐ) గ్రామానికి చెందిన రాములు (35) అనే దినసరి కూలీ రైలు పట్టాలపై పడి మృతి చెందాడు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ పాత గేటు వద్ద పట్టాలపై రాములు మృతదేహాన్ని గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకున్నారు. రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రాములు మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలు అదృశ్యం



రాజంపేట: రాజంపేటకు చెందిన ఆముదాల లచ్చవ్వ(70) రెండు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై సంపత్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన లచ్చవ్వ తిరిగి రాకపోవడంతో శనివారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.